క్లుప్తంగా

మండలంలో ఇసుక తవ్వకాలకు అనుమతి లేదు



మోపిదేవి: మండలంలో ఇసుక రీచ్‌లు లేవని, ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీ విద్య స్పష్టం చేశారు. శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం గుర్తించిన ఇసుక రీచ్‌ల నుంచి మాత్రమే ఉచిత ఇసుకను తీసుకెళ్లాలని తెలిపారు. మోపిదేవి మండలం సీఆర్‌జెడ్ పరిధిలో ఉన్నందున ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవని చెప్పారు. ఎడ్లబండ్లపై సైతం ఇసుక రవాణా చేసేందుకు వీలు లేదని, ఘంటసాల మండలం శ్రీకాకుళంలో ఇసుక రీచ్ గుర్తించారని, త్వరలో అక్కడ ఏర్పాటు చేసే స్టాక్ పాయింట్ నుంచి మాత్రమే ఇసుక తెచ్చుకోవాల్సి ఉంటుందని వివరించారు. సమావేశంలో స్థానిక ఎస్ఐ సత్యనారాయణ, వీఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మార్కెటింగ్‌లో మెలకువలు అవసరం



పెడన: మార్కెట్‌లో మెలకువలను తెలుసుకోవడానికి మెప్మాబజార్ వంటివి ఎంతగానో ఉపకరిస్తాయని మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద మెప్మా బజార్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు తమ కాళ్లపై తాము ఆర్థికంగా నిలదొక్కుకునేలా నడుచుకోవడం అభినందనీయమన్నారు. గ్రూపుల వారీగానే కాకుండా వ్యక్తిగతంగా తయారు చేసిన వాటిని మార్కెటింగ్ ఏ విధంగా చేయాలనే దానిపై మరింత అవగాహన పెంచుకుని ముందుకు సాగాలని సూచించారు. అనంతరం మెప్మా బజార్‌ను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎం. గోపాలరావు, మెప్మా టీఎంసీ భోగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోమట్ల అనిల్‌కుమార్, డ్వాక్రా ఆర్పీలు, టీడీపీ నాయకులు యక్కల శ్యామలరావు, రహమాన్ బేగ్ (పూలబాబు), మహిళలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి



పెడన: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని పెడన ఎస్ఐ- 2 వి.రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీవిజయానంద డిగ్రీ కళాశాలలో పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని పెడన ఎస్ఐ-1 సత్యనారాయణ సూచనల మేరకు సైబర్ క్రైమ్‌పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ- 2 రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సాంకేతికతను వినియోగించి ఫొటోలు మార్ఫింగ్ చేయడం, తెలియకుండా ఎదుటి వారి బ్యాంకు ఖాతాల నుంచి నగదు అపహరించడం, ఫేక్ ఎస్ఎంఎస్‌లు పంపించి మోసగించడం, ఓటీపీలు చాకచక్యంగా తెలుసుకోవడం వంటివి సైబర్ నేరాలన్నారు. అనంతరం ఈ వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారు జిల్లా స్థాయి పోటీలకు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇరిగేషన్ డీఈగా వెంకటేశ్వరరావు



అవనిగడ్డ: ఇరిగేషన్ డీఈగా పులిగడ్డ వెంకటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఏఈగా పనిచేసిన ఆయన వరదల సమయంలో డ్రెయినేజీ ఇన్‌చార్జి డీఈగా పనిచేశారు. గతంలో డీఈగా పనిచేసిన రావెళ్ళ రవికిరణ్ ఈఈగా ప్రమోషన్‌పై వెళ్లగా ఆయన స్థానంలో డీఈగా వెంకటేశ్వరరావు వచ్చారు.

చెరువు గట్టు హాంఫట్

- నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీ చెరువు గట్టు మట్టి తరలింపు
- బలహీనంగా ఉన్న చెరువు గట్టును తవ్వేస్తున్న వైనం





నడుపూరు పంచాయతీ చెరువు గట్టు తవ్వకం, (ఇన్‌సెట్) గ్రామంలో 'ఉపాధి' నిధులతో చేపట్టనున్న రోడ్డుకు తోలిన మట్టి

పెడన: మండల పరిధిలోని నడుపూరు పంచాయతీ చెరువు గట్టు మట్టిని మాయం చేసేస్తున్నారు. ఆ ఊరి టీడీపీ నాయకుడు, సర్పంచి భర్త చీర్ల కృష్ణ చెరువు గట్టు ఫొటోలు తీయడానికి వీల్లేదని, పూర్తి వివరాలు తెలుసుకోకుండా రాస్తే ఊరుకునేది లేదంటూ బెదిరింపులకు దిగారు. పెడన మండలం నడుపూరు పంచాయతీలో ఎన్‌ఆర్‌ఈజీఎస్‌తో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు వినియోగిస్తున్నామని చెబుతుండటం గమనార్హం. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.11 లక్షలు సీసీ రోడ్డు నిర్మాణానికి మంజూరయ్యాయి. పంచాయతీ రాజ్ ఏఈఈ.. ఈ రోడ్డు నిర్మాణానికి అంచనాలు రూపొందించి ఇవ్వాలి. అంచనాలు రూపొందించక ముందే రోడ్డును మెరక చేయడం, పంచాయతీ చెరువు గట్టు మట్టిని తరలించడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. మట్టి తరలింపునకు, పంచాయతీ పాత భవనం వేస్ట్ మెటీరియల్ తరలింపునకు రవాణా చార్జీలు 15వ ఆర్థిక సంఘ నిధుల నుంచి వెచ్చించేలా పంచాయతీలో ఈ నెల 10వ తేదీన జరిగిన పంచాయతీ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశామని చెబుతూ తీర్మానం కాపీని చూపించారు. అయితే ఇందులో గట్టుమీద ఉన్న మట్టిని మాత్రమే అని స్పష్టంగా రాసి ఉంది. కానీ గట్టు మట్టినే తవ్వేసి తీసుకుపోతున్నారు. ఈ తీర్మానంలో సర్పంచి సంతకం, పీఆర్ ఏఈఈ సంతకం లేదు. కేవలం పంచాయతీ కార్యదర్శి సంతకం మాత్రమే ఉంది. పంచాయతీ కార్యదర్శి సంతకంతో పంచాయతీ చెరువు గట్టును తవ్వేయడం విమర్శలకు తావిస్తోంది. వాస్తవంగా పంచాయతీ చెరువు గట్టును మట్టితో బలపరచాలేకాని మట్టిని వేరేచోటకు తరలించకూడదు. పంచాయతీ నిబంధనలు అలా ఉన్నాయి. భవిష్యత్తులో చెరువులో నీరు ఎక్కువగా ఉంటే గట్టు తెగి ఇళ్లమీదకు నీరు పోయే పరిస్థితి నెలకొంటే అప్పుడు ఎవరు సమాధానం చెబుతారనే వాదన వినిపిస్తోంది.

ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి షేక్ రఫీకుద్దీన్ మాట్లాడుతూ పంచాయతీ చెరువు గట్టు మట్టిని తవ్వి సీసీ రోడ్డుకు తరలించడానికి పంచాయతీ తీర్మానం చేసింది. గ్రామాభివృద్ధికే కాబట్టి ఎవరూ అభ్యంతరం వ్యక్తం చేయలేదు. భవిష్యత్తులో చెరువుకు ఇబ్బంది లేకుండా గట్టును పటిష్ట పరచడం జరుగుతుందన్నారు. పంచాయతీరాజ్ ఏఈఈ వై.ధర్మయ్య మాట్లాడుతూ పంచాయతీ చెరువు గట్టు తవ్వుతున్న విషయం నా దృష్టికి రాగానే పనులు నిలుపుదల చేయమని పంచాయతీ కార్యదర్శికి తెలియజేశామన్నారు. వాస్తవంగా ఆ సీసీ రోడ్డు పనులకు అంచనాలు రూపొందించలేదని తెలిపారు. అవసరమైన మట్టిని బయట నుంచి తెచ్చుకోవాలని తెలియజేశామని చెప్పారు. పెడన ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.జయరాం మాట్లాడుతూ పంచాయతీ నిబంధనల మేరకు మట్టి తవ్వకూడదన్నారు. అయితే ప్రభుత్వం సంక్రాంతి లోపు పనులు పూర్తి చేయాలని పేర్కొనడం వల్ల ప్రస్తుతం మట్టి లభించని పరిస్థితి. గ్రామాభివృద్ధికే కాబట్టి పంచాయతీ చెరువు గట్టుమీద మట్టిని తీసుకువెళ్తున్నారేమో తెలుసుకుంటా. గట్టు బలహీనంగా ఉంటే తవ్వకం పనులు నిలుపుదల చేయిస్తా.

ఇళ్ల మధ్య మద్యం షాపు ఏర్పాటు నిలిపివేయండి

జేసీ గీతాంజలిశర్మకు ఘంటసాల మహిళల వినతి



జేసీ గీతాంజలిశర్మకు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన ఘంటసాల గ్రామస్తులు

చిలకలపూడి(మచిలీపట్నం): ఘంటసాల గ్రామంలో నివాసాల మధ్య మద్యం షాపును ఏర్పాటు చేయకుండా నిలిపివేయాలని ఘంటసాల గ్రామానికి చెందిన మహిళలు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ కు శుక్రవారం సాయంత్రం వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని మల్లంపల్లి రోడ్డు పాత సంతబజార్ వద్ద మద్యం షాపును ఏర్పాటు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. 100 మీటర్లలోపే సీఎస్ఐ, ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరం, రామాలయం, అంబేడ్కర్ విగ్రహం ఉన్నాయన్నారు. వీటి మధ్య మద్యం షాపును ఏర్పాటు చేయకుండా ఉండాలని దీనిని ఏర్పాటు చేస్తే తామంతా ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోయారు. దీంతో పాటుగా 385 మంది నివాసాలు ఏర్పాటు చేసుకున్న జగనన్న కాలనీకి ఎదురుగానే ఈ మద్యంషాపును ఏర్పాటు చేసేలా ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆ ప్రాంతంలో ప్రతిరోజూ మహిళలు, విద్యార్థుల రాకపోకలు ఎక్కువగా సాగుతాయన్నారు. దీంతో షాపు ఏర్పాటు చేస్తే తమ పరిస్థితి ఇబ్బందికరంగా ఉంటుందని జేసీకి వివరించారు. ఈ మద్యం షాపును గ్రామ శివారులో ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

వైద్య కళాశాలకు భౌతికకాయం అందజేత



లక్ష్మణరావు మృతదేహాన్ని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆశాలతకు అందజేస్తున్న కుటుంబ సభ్యులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని దేశాయిపేట గడ్డిబజారుకు చెందిన మాజీ సైనికుడు కొండదాసుల లక్ష్మణరావు (84) శుక్రవారం మృతి చెందారు. తన మృతి అనంతరం భౌతికకాయాన్ని వైద్యకళాశాలకు అందించాలనే ఆయన కోరిక మేరకు కుటుంబ సభ్యులు ఆయన భౌతికకాయాన్ని మచిలీపట్నం ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అప్పగించి అంగీకారపత్రాన్ని కళాశాల వైస్‌ప్రిన్సిపాల్, అనాటమీ విభాగ అధిపతి డాక్టర్ డి.ఆశాలతకు అందజేశారు. లక్ష్మణరావు భౌతికకాయాన్ని వైద్య పరిశోధనల కోసం వినియోగించనున్నట్లు ఆమె తెలిపారు. శ్రీసత్యసాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్, లక్ష్మణరావు కుటుంబ సభ్యులు, ఎంబీబీఎస్ మొదటి సంవత్సర విద్యార్థులు పాల్గొన్నారు.

మక్కా యాత్రికులకు సత్కారం



గూడూరు: పవిత్ర మక్కా యాత్రకు వెళ్తున్న గూడూరుకు చెందిన అబ్దుల్ హమీద్, షేక్ అబ్దుల్ మన్నాన్‌లను జామియా మసీదులో శుక్రవారం ఘనంగా సత్కరించారు. మసీదు మౌజన్‌గా పనిచేస్తున్న అబ్దుల్ హమీద్ దంపతులతో పాటుగా గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ మన్నాన్ ఉమ్రా యాత్రకు ఈనెల 27న మక్కాకు వెళ్తున్నారు. శుక్రవారం ప్రార్థనల అనంతరం వీరిద్దరినీ ముస్లింలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హాఫిజ్ మహ్మద్ షోయబ్, కమిటీ సభ్యులు మహ్మద్ బషీర్, మహ్మద్ ఇస్మాయిల్, జమాల్ బేగ్, నూరుల్లా, నిర్గన్‌షా, ఏజాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

అవనిగడ్డ: స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం 'డయల్ యువర్ డీఎం'కార్యక్రమాన్నినిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కె.హనుమంతరావు శుక్రవారం తెలిపారు. బస్ సర్వీసులకు సంబంధించి సూచనలు, సలహాలుఇవ్వొచ్చన్నారు. ఆసక్తి గలవారు ఆ రోజు ఉదయం 11.30 నుంచి 12.30 గంటల లోపు 99592 25466 నంబర్‌కు కాల్ చేయాల్సిందిగా కోరారు.

ఎంఏవోగా ఆంజనేయకుమార్

గూడూరు: మండల వ్యవసాయ శాఖ అధికారిగా కె.ఆంజనేయ కుమార్ నియమితులయ్యారు. గుంటూరు వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో పాడి పంటలు మాసపత్రిక విభాగంలో పనిచేస్తున్న ఆంజనేయ కుమార్‌ను ఏఓగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ మండల వ్యవసాయ శాఖ అధికారిగా పనిచేస్తున్న జి.వి.శివప్రసాద్‌ను గుంటూరు వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేశారు.

శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

మచిలీపట్నంటౌన్: కార్తికమాసం సందర్భంగా నవంబరు 2 నుంచి 30వ తేదీ వరకు జిల్లాలోని ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి ఎ.వాణిశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచారామాలకు ప్రతి ఆదివారం రాత్రి, కార్తిక పౌర్ణమి రోజున అరుణాచలంకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నామన్నారు. యాగంటి, మహానంది, శ్రీశైలం, త్రిలింగ దర్శనానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. కార్తిక మాసంలో శైవక్షేత్రాల దర్శనానికి జిల్లా నుంచి గత ఏడాది కార్తిక మాసంలో పలు శైవ క్షేత్రాలకు 150 ప్రత్యేక బస్సులు తిప్పామన్నారు. ఈ ఏడాది ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని 200 ప్రత్యేక బస్సులను నడిపేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. అవనిగడ్డ డిపో నుంచి 38, గుడివాడ నుంచి 50, మచిలీపట్నం నుంచి 70, గన్నవరం నుంచి 23, ఉయ్యూరు నుంచి 19 ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నామన్నారు. ఈ ప్రత్యేక సర్వీసును భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలకు ఆయా డిపోలను సంప్రదించాలని సూచించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే సహించం

పెడన: ట్రాఫిక్ నిబంధనలను పాటించకుండా ఇష్టానుసారంగా నిలుపుదల చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే ఊరుకునేది లేదని పెడన ఎస్ఐ-1 జి.సత్యనారాయణ ఆటో డ్రైవర్లకు స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని బంటుమిల్లి రోడ్డులో పలు ఆటోలను నిలుపుదల చేసి వారి లైసెన్సులు, ఇతర రికార్డులను పరిశీలించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనల గురించి స్పష్టం చేశారు. వెనుక నుంచి వస్తున్న వాహనాలను చూసుకోకుండా ఇష్టానుసారంగా నిలుపుదల చేసి ప్రయాణికులను ఎక్కించుకోవడం, దించడం వంటివి పరిపాటిగా చేస్తున్నారని, రోడ్డు పక్కగా నిలుపుదల చేసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా నడుచుకోవాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే ఆటోలు పోలీస్ స్టేషన్‌కు తరలించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

పన్నుల వసూలు కౌంటర్ల పనివేళలు పెంపు

మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంటి పన్ను, తాగు నీరు, ఖాళీ స్థలాలు తదితర పన్నుల వసూలు కౌంటర్ల పనివేళలను పెంచినట్లు కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కౌంటర్లు నిర్విరామంగా పనిచేస్తాయన్నారు. మధ్యాహ్నభోజన విరామం కూడా లేకుండా నగర ప్రజల నుంచి పన్నులు స్వీకరిస్తారన్నారు. ప్రధానమైన 12 పండుగలు మినహాయించి రెండో శనివారం, ఆదివారంతో సహా అన్ని రోజుల్లో కౌంటర్లలో పన్నులు చెల్లించవచ్చన్నారు. నగర ప్రజల సౌకర్యార్థం ఈ మార్పులు ఈ నెల 27వ తేదీ ఆదివారం నుంచి అమలులోకి వస్తాయన్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వాణిజ్య పంటల సాగుపై శిక్షణ

కోసూరువారిపాలెం(మోపిదేవి): వాణిజ్య పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతిలో సాగు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి సూచించారు. మండలంలోని కోసూరువారిపాలెంలో శుక్రవారం వాణిజ్య పంటలపై ఒక రోజు శిక్షణ కల్పించారు. ఆమె మాట్లాడుతూ వివిధ వాణిజ్య పంటల్లో ముఖ్యంగా టామటాలో ఆశిస్తున్న పురుగులు, తెగుళ్ల నివారణకు పలు సూచనలు చేశారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజువాణి టమాటా అధిక దిగుబడులు సాధించుటకు యాజమాన్య పద్ధతులను వివరించారు. మత్స్యశాస్త్రవేత్త యశ్వంత్‌కుమార్, విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ బీ నవీన్, ఏవో హెప్సిబారాణి, పలువురు రైతులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ పరికరాల అందజేత

పెడన: మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ పరికరాలను సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ గోపాలరావు మాట్లాడుతూ విధులలో నిర్లక్ష్యం వహించకుండా రక్షణ పరికరాలను వినియోగించుకుని, ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు యక్కల శ్యామలరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రహమాన్ బేగ్ (పూలబాబు), సచివాలయాల శానిటరీ కార్యదర్శులు, మేస్త్రీలు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

తలగడదీవి(నాగాయలంక): కృష్ణా జిల్లా కబడ్డీ క్రీడాకారుల ఎంపిక పోటీలలో రాష్ట్రస్థాయికి ఎంపికైన స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని కొక్కిలిగడ్డ సుజాతను శుక్రవారం ఎంఈఓ టీవీఎం రామదాసు అభినందించారు. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో ఈనెల 22న జరిగిన ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టులో ఈ బాలిక ప్రాతినిధ్యం వహించింది. బాలిక క్రీడాప్రతిభను తెలుసుకుని ఎంఈవో అభినందించి సర్టిఫికెట్ అందజేశారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో అన్నమయ్య జిల్లా రాయచోటిలో రాష్ట్రా స్థాయిలో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపిక పోటీలకు సుజాత హాజరు అవుతుందని ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు చెప్పారు. హెచ్.ఎం.బండ్రెడ్డి శివరామ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుకాణాల బహిరంగ వేలం వాయిదా

పెడన: పురపాలక సంఘానికి చెందిన 20 దుకాణాల బహిరంగ వేలం వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం. గోపాలరావు తెలిపారు. శుక్రవారం పురపాలక సంఘ కార్యాలయంలో వేలం నిర్వహించేందుకు కమిషనర్ గోపాలరావు, ఆర్ఐ వెంకటేశ్వరరావు సిద్ధమయ్యారు. అయితే దుకాణాలను దక్కించుకోవడానికి ఎవరూ రాకపోవడంతో కమిషనర్ వేలం వాయిదా వేశారు. ఎప్పుడు వేలం నిర్వహించేదీ తర్వాత ప్రకటిస్తామన్నారు.

నేరస్తుల సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు

డీఎస్పీ అబ్దుల్‌సుభాన్



బంటుమిల్లి స్టేషన్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ సుభాన్

బంటుమిల్లి: పోలీసు శాఖ కొత్తగా రూపొందించిన యాప్ ద్వారా నేరస్తుల సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు అవుతోందని బందరు డీఎస్పీ ఎండి. అబ్దుల్‌సుభాన్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఆయన బంటుమిల్లి స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లో రికార్డులు, కేసుల నమోదు, క్రైం వివరాలు ఎస్ఐ గణేష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బందరు డివిజన్ పరిధిలో క్రైం రేటు గత సంవత్సరం కన్నా తగ్గిందన్నారు. నేరస్తులు స్థలాలు మార్చి నేరాలకు పాల్పడుతుంటారని, అటువంటి వారు ఎక్కడున్నా పట్టుకునేందుకు వారి పూర్తి సమాచారం ఆన్‌లైన్‌లో ఉంటుందన్నారు. డివిజన్‌లో జాతీయ రహదారులపై స్పీడు బ్రేకర్లకు అనుమతులు లేనందున వాహనాల వేగ నియంత్రణ కోసం హెచ్చరిక బోర్డులు, జిగ్‌జాగ్ హార్డిల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. బందరు డివిజన్‌లోని 9 స్టేషన్ల పరిధిలో 316 కేంద్రాలను గుర్తించి అక్కడ 8,066 సీసీ కెమేరాల ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదికలు పంపామన్నారు. ఈ సందర్భంగా బంటుమిల్లి మండలంలో 1,013 సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. డివిజన్‌లో ఎక్కడా పేకాటలు, జూదాలను ప్రోత్సహించేది లేదని ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన అన్నారు. బంటుమిల్లి, పెడన గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి వన్ వే ట్రాఫిక్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ సుభాన్ తెలిపారు. తొలుత ఆయనకు ఎస్ఐ గణేష్‌కుమార్ పర్యవేక్షణలో సిబ్బంది సంప్రదాయ పద్ధతిలో మార్చ్‌ఫాస్ట్ చేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పెడన సీఐ నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలి



సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై మళ్లీ భారాలు మోపేందుకు చర్యలు తీసుకోవటాన్ని నిరసిస్తూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రాజుపేట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకుడు కొడాలి శర్మ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై రూ.8,114 కోట్ల భారాన్ని మోపేందుకు రంగం సిద్ధం చేసిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బాదుడే బాదుడు కార్యక్రమాన్ని రద్దు చేస్తామని, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని నాడు చంద్రబాబు హామీ ఇచ్చారని, ప్రస్తుతం దీనిని విస్మరించి ప్రజలపై భారాలు మోపేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సీపీఎం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ట్రూఅప్, సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపేందుకు చర్యలు తీసుకుందని విమర్శించారు. గత ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందం ప్రకారం స్మార్ట్ మీటర్లు బిగించేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. దీని వల్ల ఎస్సీ, ఎస్టీ, రైతాంగానికి సంబంధించిన సబ్సిడీ రద్దయ్యే పరిస్థితులు ఎదురవుతాయన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపును వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సీహెచ్ రాజేష్, ఐద్వా నగర కార్యదర్శి కొడాలి సుజాత, సభ్యులు అరుణకుమారి, భవానీ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే ప్రాజెక్టుతో రైతాంగానికి మేలు



మోపిదేవిలంక గ్రామసభలో రీ సర్వే ప్రాజెక్టుపై వినతిపత్రం అందిస్తున్న రైతు



చిలకలపూడి గ్రామ సభలో అర్జీ ఇస్తున్న రైతు

మోపిదేవిలంక(మోపిదేవి): రీ సర్వే ప్రాజెక్టు వల్ల రైతాంగానికి ఎంతో మేలు చేస్తుందని డెప్యూటీ తహసీల్దార్ వాణి అన్నారు. మండలంలోని నాగాయితిప్ప పంచాయతీ కార్యాలయం వద్ద రైతుల అభ్యంతరాలపై శుక్రవారం సర్పంచ్ మోర్ల జ్యోత్స్న అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ రామకృష్ణబాబు మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో చేసిన భూ సర్వేను శతాబ్దకాలం తరువాత గత ప్రభుత్వంలో రీ సర్వే చేపట్టినట్లు తెలిపారు. రైతు మేజర్ కంఠంనేని బాబయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో రీ సర్వే చేపట్టారని ఈ ప్రాజెక్టు చాలా ఉత్తమమని, ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో పూర్తి చేసి రైతాంగ సమస్యలు పరిష్కరించినట్లు చెప్పారు. శాటిలైట్ ద్వారా సరిహద్దు రాళ్లు వేయడం రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. తనకు ఒక సర్వే నంబర్‌లో ఉండాల్సిన భూమి ఎల్‌పీలో మూడు భాగాలుగా సూచిస్తుందని, సరిచేయాలని అధికారులను కోరారు. వ్యవసాయాధికారులు మాట్లాడుతూ రైతు సేవ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారు. ఉచితంగా గోనే సంచులు సరఫరా చేస్తారని, లేబర్ చార్జీల భారం, రవాణా ఖర్చులకు కూడా ప్రభుత్వానిదేనని వివరించారు. మోర్ల శ్రీనివాసరావు, ఆర్ఐ ఎం శ్రీనివాసరావు, గ్రామ సర్వేయర్‌లు శరత్, సృజన, వీఆర్వోలు వెంకట రమణ, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చిలకలపూడి(ఘంటసాల): రీసర్వేలో వచ్చిన భూ సమస్యలు పరిష్కరించుకోవడానికి ఏర్పాటు చేసిన గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రీ సర్వే డీటీ పి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చిలకలపూడి గ్రామంలో ఇటీవల జరిగిన భూముల రీ సర్వేలో సమస్యలు పరిష్కరించడానికి శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 24 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. సర్పంచ్ కొణతం విజయలక్ష్మి, ఆర్ఐ కె.శ్రీనివాసరావు, ఏవో కె.మురళీ కృష్ణ, మండల సర్వేయర్ వల్లీపుష్ప, వీఆర్వో మనీషా, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కి మాతృ వియోగం

పాపవినాశనం(ఘంటసాల): మండలంలోని పాపవినాశనం మాజీ సర్పంచ్ మునిపల్లి బుజ్జి మాతృమూర్తి మునిపల్లి రాములమ్మ (80) అనారోగ్యంతో శుక్రవారం మరణించారు. పాపవినాశనంలోని వారి స్వగృహం నందు రాములమ్మ భౌతికకాయాన్ని ఉంచారు. సమాచారం తెలుసుకున్న వివిధ రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులు రాములమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతురాలు రాములమ్మకు ఇరువురు కుమారులు, ఇరువురు కుమార్తెలు ఉన్నారు.